క్లుప్తంగా

నేడు కరెంట్ కట్

చంద్రుగొండ: మండల కేంద్రంలోని 33/11 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని గ్రామాలకు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ ఎంఎల్ నర్సింహారావు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో చంద్రుగొండ, అయన్నపాలెం, దామరచర్ల, తిప్పనపల్లి, సత్యనారాయణపురం, దుబ్బతండా, రావికంపాడు, బాలికుంట, బెండాలపాడు, గుర్రాయిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని గంగారం 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో గల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనర్సింహారావు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

చిరు వ్యాపారిపై పోలీసులు దాడి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్ని దుస్తుల అమ్మకంతో జీవనం సాగిస్తున్న తనపై పోలీసులు అకారణంగా దాడి చేసినట్లు చిరు వ్యాపారి తెలిపాడు. సమయం దాటాక వ్యాపారం చేస్తున్నానని చెబుతూ పెట్రోలింగ్ వాహనంలో వచ్చిన పోలీసులు దురుసుగా ప్రవర్తించడమే కాక కొట్టారని వాపోయాడు. ఈ విషయంపై టౌన్ సీఐ నాగరాజురెడ్డిని శుక్రవారం వివరణ కోరగా ఘటన వివరాలు తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీటీ స్టైల్ జిమ్‌కు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో జరిగే పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు జిమ్ కోచ్ రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ముంబైలో జరిగే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు మామిడి భూమిక, సరియం భరత్, గాలి రామ్మోహన్‌రావును నిర్వాహకులు ఎంపిక చేసి ఆహ్వానించారని, వీరు గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు.

బోడప్ప ఆశయాలు సాధించాలి

ములకలపల్లి: పేదల సమస్యలపై తుది వరకు పోరాడిన బోడప్ప ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం సబ్‌డివిజన్ కార్యదర్శి గొని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని గుట్టగూడెంనకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు దుబ్బా బోడప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. నాయకులు శుక్రవారం ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుంజా కృష్ణ, ముదిగొండ మల్లయ్య, వీరమళ్ల ఉమ, వంకా సురేశ్, సవళ్ల ఆదినారాయణ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలి

అన్నపురెడ్డిపల్లి: వచ్చే వర్షాకాలంలో నాటేందుకు గాను ఇప్పటి నుంచే నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి అనసూయ ఆదేశించారు. మండల కేంద్రంలోని నర్సరీ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. మండలంలో గ్రామాల వారీగా నర్సరీలు, మొక్కల వివరాలపై ఎంపీడీఓ అన్నపూర్ణతో చర్చించి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఖాదర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వసతిగృహం ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలంలో శ్రీసీతారామ కమ్మ వారి సేవా సమితి ఆధ్వర్యాన నిర్మించిన వసతి గృహాన్ని ఈనెల 17న ప్రారంభిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు ఎ.జగదీశ్ తెలిపారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.91లక్షలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బేల్ సింగ్, ఆలయ మేనేజర్ రమణ పర్యవేక్షణలో లెక్కించగా రూ.1,91,039 ఆదాయం వచ్చింది. బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు ఉంటేనే 'మహాలక్ష్మి'

- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డు తప్పనిసరి
- మహిళలకు జీరో టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు



ఉచిత ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఆరంభించింది. మహాలక్ష్మి పేరిట ఈ పథకానికి 9వ తేదీన శ్రీకారం చుట్టారు. అయితే, మొదటి వారం రోజులు ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండానే మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం కల్పించారు. కానీ, కండక్టర్ల వద్ద యంత్రాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడంతో శుక్రవారం నుంచి జీరో టికెట్ జారీ చేస్తున్నారు. ప్రస్తుతం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలవుతుండగా.. ఇక నుంచి మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఏదైనా గుర్తింపు చూపిస్తేనే ఉచిత ప్రయాణానికి అనుమతించి జీరో టికెట్ జారీ చేస్తారు.

ఇక నుంచి గుర్తింపు కార్డు ఉంటేనే..

పథకాన్ని ప్రారంభించిన తర్వాత ఎలాంటి అవరోధాలు లేకుండా ఉండేందుకు వారం పాటు గుర్తింపు కార్డు లేకుండా ప్రయాణానికి అనుమతించారు. తాజాగా శుక్రవారం నుంచి మాత్రం 'మహాలక్ష్మి' పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు గుర్తింపు కార్డును తప్పనిసరి చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్లు, కండక్టర్లు, ఉద్యోగులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఇక నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయాలంటే మహిళలు, బాలికలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గుర్తింపు కార్డును కండక్టర్‌కు చూపించాలి. ఈ పథకం తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు మాత్రమే వర్తిస్తుండడంతో లబ్ధిదారులు తెలంగాణకే చెందిన వారుగా ధ్రువీకరించే ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు లేదా రేషన్ కార్డును కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. ఈ మూడు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తేనే కండక్టర్ జీరో టికెట్ జారీ చేసి ఉచిత బస్సు ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు. లేనిపక్షంలో అనుమతి ఉండదు. ఒకవేళ ఒరిజినల్ గుర్తింపు కార్డు అందుబాటులో లేకపోతే జిరాక్స్ లేదా సెల్‌ఫోన్‌లో చూపించినా సరిపోతుంది.



బస్సులో మహిళకు జీరో టికెట్ ఇస్తున్న కండక్టర్

జీరో టికెట్ అమలు చేస్తున్నాం



శుక్రవారం నుంచే ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జీరో టికెట్‌ను అమలు చేస్తున్నాం. ఆయా సర్వీసుల్లో లబ్ధిదారులు కండక్టర్లకు గుర్తింపు కార్డు చూపించాకే జీరో టికెట్ జారీ చేస్తారు. పొరపాటు కార్డు మరిచిపోతే జిరాక్స్ లేదా సెల్‌ఫోన్‌లో చూపించినా టికెట్ ఇవ్వాలని ఆదేశించాం.

–రాజ్యలక్ష్మి, డిపో మేనేజర్, సత్తుపల్లి

వరాహావతారంలో పర్ణశాల రామయ్య

దుమ్ముగూడెం: వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు శుక్రవారం మూడో రోజుకుచేరాయి. ఈ సందర్భంగా మండలంలోని పర్ణశాల ఆలయంలో రామయ్యను వరాహావతారంలో ఆలయ అర్చకులు అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామి వారిని వరాహావతారంలో అలంకరించి అవతారం విశిష్టతను వివరించారు. కాగా, శనివారం స్వామి నరసింహావతారంలో దర్శనమిస్తారని తెలిపారు. ఆలయ ఏఈఓ శ్రావణ్ కుమార్, అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ కిశోర్, అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, కిశోర్‌కుమారాచార్యులు, భరద్వాజాచార్యులు, నరసింహాచార్యులుతో పాటు ప్రసాద్, శివ, రాము పాల్గొన్నారు.



వరాహావతారంలో పర్ణశాల రామయ్య

కార్మికుల పక్షపాతి ఐఎన్‌టీయూసీ..



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

మణుగూరుటౌన్: కార్మికుల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించేది ఐఎన్‌టీయూసీ మాత్రమేనని యూనియన్ నాయకులు తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మణుగూరు ఓసీలో వెలగపల్లి జాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నామా వెంకటేశ్వర్లు, సోమరాజు, మల్లికార్జునచారి మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీని గుర్తింపు సంఘంగా గెలిపించడం ద్వారా సమస్యలన్నీ పరిష్కారమవుతాయని తెలిపారు. సమావేశంలో నాయకులు పూజారి శ్రీను, బోగా రాజలింగు, ముక్తేశ్వర్‌రావు, రాములు, సూరయ్య, వెంకటరత్నం, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు నాయకుల శుభాకాంక్షలు



తుమ్మలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే పాయం



శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మణుగూరుటౌన్: హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారం, చేనేత వస్త్రాల శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రుగొండ: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధరావత్ రామారావు, ఎస్కే సైదా, మచ్చా కుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గొని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్డీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ తిరుమలాచారికి వినతిపత్రం అందజేశాక నాగేశ్వరరావు మాట్లాడారు. గోదావరి వరద సమయంలో మెరక ప్రాంతాల్లో ఇళ్లు నిర్మిస్తామని హామీలిచ్చిన పాలకవర్గాలు తరువాత పట్టించుకోవటం లేదని తెలిపారు. కార్యక్రమంలో ముసలి సతీశ్, వైఎస్ రెడ్డి, వీరమల్ల ఉమ, ముత్యాల సత్యనారాయణ, సిరిగిడి నరేశ్, రవి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఎన్డీ నాయకులు

రేపటి నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నీ

అశ్వాపురం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 17 నుంచి అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో మండలస్థాయి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తృతీయ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గొల్లపల్లి నరేశ్, నాగరాజు, సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నంలోగా టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మ్యాచ్ టెన్నిస్ బాల్‌తో నిర్వహిస్తామని, ఎంట్రీ ఫీజు రూ.1,000 చెల్లించాలని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.16 వేలు డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ద్వితీయ బహుమతి రూ.12 వేలు అశ్వాపురం సర్పంచ్ బానోత్ శారద, గొందిగూడెం సర్పంచ్ పాయం భద్రమ్మ, షీల్డు దానధర్మ ట్రస్ట్ నిర్వాహకురాలు గంటా రాధ స్పాన్సర్ చేస్తారని వివరించారు. పూర్తి వివరాలకు 91105 01150, 77803 66151, 81064 54541 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డీసీసీబీ డైరెక్టర్‌కు సన్మానం

అశ్వాపురం: డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యను మండల కేంద్రంలో ఆయన నివాసంలో శుక్రవారం పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేసిన బ్రహ్మయ్య వారి విజయానికి కృషి చేశారని తెలిపారు. అశ్వాపురం సర్పంచ్ బానోత్ శారద – సదర్‌లాల్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం



దుమ్ముగూడెం: విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో ములకపాడు డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యాన శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆ తర్వాత హాస్టల్ ఆవరణ, పరిసరాల్లో పరిశుభ్రతపై సూచనలు చేశారు. అనంతరం ఆర్లగూడెం సబ్ సెంటర్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది గంగాధర్, గంగమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



చర్లరూరల్: కొత్తపల్లిలో పరీక్షిస్తున్న వైద్యులు

కొత్తపల్లిలో..

చర్లరూరల్: మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ స్థానికులకు పరీక్షలు చేసి షుగర్, బీపీ బాధితులకు మందులు పంపిణీ చేశారు. ఆ తర్వాత పాతచర్లలో దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రామలక్ష్మి, వేణుగోపాలకృష్ణ, రాంప్రసాద్, శిరీష, సరస్వతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఆటోడ్రైవర్ల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆటోడ్రైవర్లు

అన్నపురెడ్డిపల్లి: న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మండలంలోని ఆటోడ్రైవర్లు తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. తొలుత ఆటోలతో తహసీల్‌వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో ఆటోలు ఎవరూ ఎక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఆటోకార్మికుడికి నెలకు రూ.15 వేలు చెల్లించడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జమలయ్య, సురేశ్, వెంకటేశ్వర్లు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ల సమస్య పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ ఒప్పందాన్ని అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని మణుగూరు ఏరియా ఈపీ ఆపరేటర్లు కోరారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా శుక్రవారం ప్రచారానికి విచ్చేసిన టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావుకు ఆపరేటర్లు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, వీరభద్రం, సీహెచ్‌వీ రెడ్డి, కాపా శివాజీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

మణుగూరుటౌన్/మణుగూరురూరల్: పొట్టి శ్రీరాములు వర్ధంతిని మణుగూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కత్తి రామచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు కడివెండి విశ్వనాథ గుప్తా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమేశ్‌బాబు, బండారు నర్సింహారావు, శ్రీరాం రాము, సుగల భాను, శేషుబాబు, డి.బ్రహ్మయ్య, సముద్రాల కృష్ణమూర్తి, కె.కృష్ణమూర్తి, ప్రసాద్, నాగరత్నమణి, కొత్త ఇందుమతి, బి.మానస, స్వరాజ్యం పాల్గొన్నారు. అలాగే లయన్స్‌క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గాజుల పూర్ణచందర్‌రావు, అడబాల నాగేశ్వరరావు, బాగం రమేశ్, నర్సింహారావు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి: మండలంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో బోడా పద్మ, పర్సా వెంకటేశ్వర్లు, వనమా గాంధీ, బాణావత్ భీముడు, కల్లోజి నర్సింహారావు, గోళ్ల పుల్లారావు, వనమా శ్రీనివాసరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: మండల కేంద్రంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో దోసపాటి పిచ్చేశ్వరరావు, బచ్చు స్వరాజ్యరావు, రేపాక వెంకటరమణ, సందీప్, కొండె సత్యం, దోసపాటి చింటు, వీరభద్రం, నరసింహారావు, లక్ష్మీనారాయణ, సురేశ్, రాజేశ్, ధనుంజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: మండలంలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో కొణిజర్ల ఉమామహేశ్వరరావు, జల్లిపల్లి దేవరాజు, శీమకుర్తి సుబ్బారావు, బోగవల్లి రాంబాబు, సత్యవరపు సంపూర్ణ, బాలగంగాధర్, జల్లిపల్లి నారాయణరావు, కంచర్ల సత్తిబాబు, కలకోటి లక్ష్మీనారాయణ, ఎస్‌వీటీ కొండ, సమయమంతుల మోహన్‌రావు, కోరుకొండ రామ్మోహన్, కర్పూరం సత్యనారాయణ, పోలేపల్లి శ్రీను పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



మణుగూరురూరల్: నివాళులర్పిస్తున్న దృశ్యం



అన్నపురెడ్డిపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



అశ్వాపురం: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



అశ్వారావుపేటరూరల్: నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శనలు ఇస్తుండగా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, కళాకారులు నృత్యాలు, ఇతర ప్రదర్శనలు ఇస్తున్నారు.

అవగాహనతోనే కుష్ఠు నివారణ

కరకగూడెం: సరైన సమయంలో సమస్యను గుర్తించి చికిత్స చేయించుకుంటేనే కుష్ఠు వ్యాధి నివారణ సాధ్యమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యనిర్వహణ అధికారి టి.మోహన్ తెలిపారు. కరకగూడెం పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం పలువురిని పరీక్షించాక ఆయన మాట్లాడారు. కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించగానే చికిత్స చేయించుకుంటేనే అంగవైకల్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీను, సత్యనారాయణ, ముత్యాలరావు, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, గన్యా, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

విద్యార్థికి పలువురి అభినందన



విద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

ములకలపల్లి: రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో సత్తాచాటిన పాతగంగారానికి చెందిన ఇర్పా ప్రతాప్‌ను సర్పంచ్ వాడె లక్ష్మి శుక్రవారం సన్మానించారు. గుజరాత్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన ఆయన జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ప్రతాప్‌ను సన్మానించగా, సురేశ్, నాగమణి, సునీత, అరుణకుమారి, ఇర్పా ప్రసాద్, వాడే శేషగిరి, ఈర్ల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.